కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, జనవరి 28 : కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం, స్పోర్ట్స్ డే సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఇంటర్ విద్యార్థులు ప్రతిరోజూ కష్టపడి చదవాలన్నారు. లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా సాగాలని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని 20 ప్రభుత్వ కళాశాలలో ఎంపిక చేసిన విద్యార్థులకు జేఈఈ వంటి పరీక్షల్లో సీటు సాధించేందుకు కోచింగ్ తరగతులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థినులు నృత్యాలతో అలరించారు. ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాం, మెమెంటోల దాతలు డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ అరవింద్, డాక్టర్ కృప, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లబాడ్జీలతో కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన

సౌత్ క్యాంపస్ ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

భిక్కనూరు, జనవరి 28 : కాంట్రాక్ట్ అధ్యాపకులను ప్రభుత్వం గుర్తించడం లేదని, నల్ల బ్యాడ్జీలతో సౌత్ క్యాంపస్ ప్రాంగణంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు మంగళవారం నిరసన తెలిపారు. రాష్ట్రంలో 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేయాలని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. విశ్వ విద్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేసి కాంట్రాక్ట్ అధ్యాపకులను విస్మరించడం బాధాకరమని అన్నారు. తమ శ్రమను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నారాయణ, గర్ల్స్, బాయ్స్ హాస్టల్ వార్డెర్లు సునీత, యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, నిరంజన్, వైశాలి, సరిత, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో చందర్

నస్రుల్లాబాద్, జనవరి 28 : మండల కేంద్రంలోని సమీకృత మండల కార్యాలయ భవన సముదాయం వద్ద నూతనంగా రూ.కోటీ 30 లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని జడ్పీ సీఈవో చందర్ మంగళవారం పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారుకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో సూర్యకాంత్ ఉన్నారు.

'కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి'

బాన్సువాడ, జనవరి 28 : పట్టణంలోని 17వ వార్డులో బాన్సువాడ, ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ఉన్న ఖాళీ స్థలాలను కొందరు కబ్జాలకు పాల్పడ్డారని, ఇంటి నంబర్లు వేసుకొని రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ మున్సిపల్ అధికారులకు మంగళవారం విన్నవించారు. అంతే కాకుండా గ్రామపంచాయతీ లేవుట్ ప్రకారం బాన్సువాడ –ఎల్లారెడ్డి రహదారి మెయిన్ రోడ్డు నుంచి బురుజు వైపు జీపీ రోడ్డు ఉన్నట్లు కొన్ని డాక్యుమెంట్లలో ఉందని తెలిపారు.

'అపార్'ను వేగవంతం చేయాలి

రాజంపేటలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న జిల్లా విద్యాధికారి రాజు

రాజంపేట్, జనవరి 28 : ప్రతి పాఠశాలలో అపార్‌ను వేగవంతం చేయాలని జిల్లా విద్యాధికారి రాజు అన్నారు. రాజంపేటలో మంగళవారం ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత(బాలబాలికల)పాఠశాలతోపాటు కస్తూర్బా గాంధీ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అపార్ (అటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) పరిశీలించి జిల్లాలో ప్రతి పాఠశాలలో అపార్ ను వేగవంతం చేయాలని సూచించారు. ప్రాథమికోన్నత పాఠశాలలో పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి పూర్ణ చందర్‌రావు ఏసీజీఈ అధికారి బలరాం నాయక్, డీఈవో అసిస్టెంట్ బాలు, సీఆర్పీలు లింగం, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

బోర్లంలో మాట్లాడుతున్న అంబేద్కర్ సంఘం నాయకులు

బాన్సువాడలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బాన్సువాడ రూరల్/బాన్సువాడ టౌన్, జనవరి 28 : పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బోర్లం గ్రామ అంబేద్కర్ సంఘం నాయకులు మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బోర్లంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట విలేకరులతో మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం రోజు అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం మూర్ఖుల చర్య అని అన్నారు. దుండగులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిలు, అనిల్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింహులు, డివిజన్ ఉపాధ్యక్షుడు చిన్న సాయిలు తదితరులు ఉన్నారు. బాన్సువాడలోని అంబేద్కర్ చౌరస్తాలో బాన్సువాడ దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. దుండగులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మైసయ్య, కుమ్మరి రాజు, కొత్తాబాది సాయిలు, ఎజాస్, ప్రశాంత్, వినోద్, హకీం, గంగారాం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'వెంటనే బదిలీ చేయాలి'

కామారెడ్డి, జనవరి 28 : జిల్లాలో 317 బాధిత ఉపాధ్యాయులను లోకల్ డిస్ట్రిక్స్ వెంటనే బదిలీ చేపట్టాలని మంగళవారం డీఈవో రాజుకు 317 స్పౌజ్ స్కూల్ అసిస్టెంట్ హిందీ, తెలుగు సబ్జెక్ట్ ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు లోకల్ డిస్ట్రిక్ట్ అలర్ట్ చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే లోకల్ డిస్ట్రిక్ట్ అలర్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో టీఆర్టీఫ్ జిల్లా అధ్యక్షుడు బషీర్, బాధిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

కామారెడ్డి/బాన్సువాడ, జనవరి 28 : జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జిల్లా రవాణాధికారి శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. వాహనాదారుడు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడలోని సాయి కీర్తి కళాశాలలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంవీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్, కళాశాల ప్రిన్సిపాల్ రాజు, నెహూ కేంద్రం వలంటీర్ సునీల్ రాథోడ్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నస్రుల్లాబాద్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

నస్రుల్లాబాద్, జనవరి 28 : మండల కేంద్రంలోని రైస్ మిల్ నుంచి విజయకృష్ణ కాలనీ వరకు నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను మాజీ ఎంపీటీసీ సభ్యుడు కంది మల్లేశ్ మంగళవారం ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా రూ.7లక్షలు మంజూరయ్యాయని, దీంట్లో భాగంగా పనులను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యూసుఫ్, మైశాగౌడ్, భూమయ్య, సాయాగౌడ్, గౌస్, అజ్గర్ అలీ, ఫయాజ్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పోషణ లోపం నివారణపై అవగాహన

రాజంపేట్, జనవరి 28 : మండలం కొండాపూర్ క్లస్టర్‌లోని శ్రీశక్తి సంఘం కార్యాలయంలో చిన్న సంఘాల అధ్యక్షులకు పిల్లల్లో పోషణ లోపం నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఐదేండ్లలోపు పిల్లల్లో పోషణ లోపం పెరుగుతున్నదని, దీంతో శారీరక పెరుగుదల, మానసిక వికాసం బలహీన పడుతున్నదని తెలిపారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గ్రామ సంఘం కార్యదర్శి లావణ్య, కోశాధికారి రాజమణి, సీసీ భాగయ్య, వీవోఏ రజిత పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 28: మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట్ గ్రామానికి చెందిన వ్యక్తి కనబడకుండా పోయాడని ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగారెడ్డిపేట్‌కు చెందిన షేక్‌అహ్మద్(44) మటన్ అమ్ముతూ జీవనం సాగించేవాడు. ఐదేండ్లుగా అతడి మానసిక స్థితి సరిగ్గా ఉండడం లేదు. ఈనెల 24న ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో సెల్‌ఫోన్ పెట్టి బయటికి వెళ్లి ఎంతకూ తిరిగిరాలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అహ్మద్ ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన సమయంలో బ్లాక్ కలర్ ప్యాంట్, పసుపుపచ్చ షర్ట్ ధరించి ఉన్నాడు. ఛామనఛాయ రంగు, కోలముఖం, తెల్లవెంట్రుకలు ఉండి, తెలుగు, హిందీ భాషలు మాట్లాడగలడు. అతడి భార్య పొలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కల్లు దుకాణం తలుపులు మూసివేయించాలి

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 28: వార్డులోకి వచ్చే విధంగా ఉన్న కల్లుదుకాణం తలుపులను మూసివేయించి వార్డులో నివసిస్తున్న ప్రజలను దుర్గంధం, రోగాల బారి నుంచి కాపాడాలని స్థానికులు మున్సిపల్ మేనేజర్ వాసంతికి వినతిపత్రం సమర్పించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని 6వ వార్డు ప్రజలు మేనేజర్‌ను కలిసి మంగళవారం వినతి పత్రం ఇచ్చి తమ ఆవేదన వ్యక్తం చేశారు. కల్లు తాగడానికి వచ్చిన ప్రజలు తాగిన తర్వాత ఇండ్ల ముందర విచ్చలవిడిగా మూత్ర విసర్జన, మలవిసర్జన చేసి దుర్గంధంగా మారుస్తున్నారని, వార్డువైపునకు ఉన్న కల్లుదుకాణ తలుపులు మూసి ఉంచాలని, దుకాణానికి మరో పక్క ఉన్న తలుపును తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అయ్యన్నగారి సాయిప్రసాద్, పుండరి విఠల్, గుజ్జరి సిద్ధు వార్డుప్రజలు తదితరులు ఉన్నారు.

పిల్లల్లో పోషణ లోపంపై శిక్షణ

పెద్ద కొడప్‌గల్, జనవరి 28 : పిట్లం ఐకేపీ కార్యాలయంలో వీవోఏ, గ్రామ సంఘం సభ్యులకు పిల్లల్లో పోషణలోపం తగ్గించడం, నివారించడంపై జిల్లా మాస్టర్ ట్రైనర్ రాంనారాయణగౌడ్ మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఐదేండ్లలోపు పిల్లల్లో పోషక లోపం పెరుగుతున్నదని, దీంతో వారిలో శారీరక పెరుగుదల, మానసిక వికాసం బలహీన పడుతున్నదన్నారు. పిల్లల్లో పోషణ లోపాన్ని సాధారణ ఆరోగ్యం, పోషకాహార పద్ధతులను అనుసరించి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

సదాశివనగర్‌లో..

రామారెడ్డి (సదాశివనగర్), జనవరి 28 : పిల్లల్లో పోషకలోపం పెరుగుతున్నదని డీపీఎం రమేశ్‌బాబు అన్నారు. సదాశివనగర్‌లోని రైతువేదికలో ఆయన పిల్లల్లో పోషకాహార లోపం నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

పాస్‌పోర్ట్ పోయినది

★ నేను అయిత శశివర్ధన్ (Aitha Shashivardhan) S/o. అయిత లచకోటి (Aitha Lachakoti) ఇ.నెం. 2-48 గ్రా||ముచ్కూర్, మం|| భీంగల్, ని|| నిజామాబాద్, T.S., నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం.B9825339 గలది. తేది: 25/12/2024 నాడు బైక్ మీద ముచ్కూర్ నుండి భీంగల్ వెళ్ళే క్రమంలో మార్గమధ్యలో ఎక్కడో పడిపోయింది. దొరికినవారు ఈ నెంబర్‌కు తెలియజేయండి. 7093494771
NTZ-338460

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పెద్దకొడప్‌గల్, జనవరి 28 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయ ఆవరణలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్, గోడ పత్రికను తహసీల్దార్ దశరథ్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రవికాంత్, ఆర్ఐ అంజయ్య, జాతీయ బీసీ సంక్షేమ జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్, ఆకుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

పెద్దకొడప్‌గల్, జనవరి 28 : ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని విఠల్‌వా డి తండా, విఠల్‌వాడి, లింగంపల్లి, బాబుల్‌గాం గ్రామాల్లోని పాఠశాలలను మంగళవారం ఎంఈవో సందర్శించి పాఠశాలకు సంబంధించిన రికార్డులు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఎంఈవో వెంట సీఆర్పీ గోపాల్‌సింగ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వంతెన నిర్మాణానికి సర్వే

గాంధారిలో పోచమ్మ రేవు వాగుపై వంతెన నిర్మాణానికి సర్వే చేస్తున్న అధికారులు

గాంధారి, జనవరి 28: మండల కేంద్రంలోని పోచమ్మ రేవు వాగుపై వంతెన నిర్మాణానికి మంగళవారం పంచాయతీరాజ్ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. వాగుపై వంతెన నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించడానికి సర్వే చేపట్టారు. దీంతో శివారు రైతులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పోచమ్మ రేవు వాగుపై వంతెన నిర్మించే ప్రదేశాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పరిశీలించారు. వంతెన, బీటీ రోడ్డు నిర్మాణానికి 4.90 కోట్ల రూపాయలను మంజూరు చేయించారు. టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి వంతెన పనులను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. పీఆర్ ఏఈ సురేశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల లక్ష్మణ్, విండో డైరెక్టర్ తాడ్వాయి సంతోష్, మాజీ ఎంపీటీసీలు తూర్పు రాజు, కామెల్లి బాలరాజు, నాయకులు సంతోష్, బాలయ్య, రమేశ్, శంకర్, ఈశ్వర్‌గౌడ్, రవి, బషీరొద్దీన్, రైతులు పాల్గొన్నారు.

ఆర్భాటంగా తెచ్చారు.. నిర్లక్ష్యంగా పడేశారు



ఎల్లారెడ్డి డబుల్ బెడ్ రూం ఇండ్ల వద్ద నిర్లక్ష్యంగా పడేసిన మొక్కలు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 28: ఎమ్మెల్యే మెప్పు పొందడానికి ఆర్భాటం ప్రదర్శించి తెచ్చిన మొక్కలను అధికారులు నిర్లక్ష్యంగా పడేశారు. 26 జనవరి గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఎల్లారెడ్డి పట్టణ శివారులోని సోమార్‌పేట్ బేస్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమం సందర్భంగా అధికారులు ప్రదర్శించిన తీరును ప్రజలు విమర్శిస్తున్నారు. డబుల్‌బెడ్ రూం ఇండ్ల వద్ద ఏర్పాటుచేసిన శిలాఫలకాల సమీపంలో, ఎమ్మెల్యే మాట్లాడడానికి ఏర్పాటు చేసిన స్టేజ్ సమీపంలో, ఎమ్మెల్యే చూసే కను చూపుమేరలో అధికారులు పచ్చదనం కనిపించాలని మొక్కలు నాటారు. మిగతా మొక్కలను డబుల్‌బెడ్ రూం ఇండ్ల సమీపంలో పడేశారు. 'కార్యక్రమం ముగిసిన తర్వాత మిగిలిన మొక్కలను తిరిగి నర్సరీకి తరలించినా మంచిగుంటుండె.. కాని అధికారులు నిర్లక్ష్యంగా పడేసింద్రు. మొక్కలన్నీ ఎండిపోయి సచ్చిపోతున్నయి ఒకదిక్కు.. మొక్కలు నాటాలే అంటూ ప్రచారం చేసే ప్రభుత్వం.. గిట్ల మొక్కలు పడేస్తే ఎట్లా' అంటూ ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పెద్దకొడప్‌గల్, జనవరి 28 : పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసిన ఘటన మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో చోటుచేసున్నది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి పక్కా సమాచారం మేరకు కాస్లాబాద్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాడుతున్న 8 మందిని పట్టుకొని వారి నుంచి రూ.24 వేల 380 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

పెద్దకొడప్‌గల్, జనవరి 28 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ మంగళవారం తెలిపారు. మండలంలోని బేగంపూర్ గ్రామ శివారు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, కేసు నమోదు చేసి తహసీల్దార్ దశరథ్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పనిసరి

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 28: ఉద్యోగం చేసిన ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదని ఎంఈవో వెంకటేశం అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రాథమిక బాలికల పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసి జనవరి 31న ఉద్యోగ విరమణ చేయనున్న షఫీని ఎంఈవో, తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడారు.

డ్రోన్ సహాయంతో మందు పిచికారీ

నిజాంసాగర్, జనవరి 28 : మాగి గాయత్రి షుగర్స్ వారి ఆధ్వర్యంలో మండల రైతుల అవసరాల నిమిత్తం డ్రోన్ సహాయంతో కలుపు నివారణ మందు పిచికారీ, చీడపీడల నివారణార్థం ఎకరానికి రూ. 450 చొప్పున డ్రోన్‌ను అందుబాటులో ఉంచారు. మంగళవారం గోర్గల్ గ్రామంలో ఒక రైతు పొలంలో కలుపు నివారణ కోసం స్ప్రే చేశారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని మాగి గాయత్రీ షుగర్స్ యాజమన్యం తెలిపింది.

యూపీఎస్ ప్రతులు దహనం

ఎల్లారెడ్డి జడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో యూపీఎస్ ప్రతులను దగ్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

లింగంపేట/ఎల్లారెడ్డి రూరల్/మాచారెడ్డి, జనవరి 28: మండలంలోని ఐలాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో యూపీఎస్ ప్రతులను ఉపాధ్యాయులు మంగళవారం దహనం చేశారు. పాఠశాల విరామమం సమయంలో యూపీఎస్ ప్రతులతోపాటు దిష్టి బొమ్మను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఓపీఎస్ అమలుపర్చాలని ఉద్యోగులు యూపీఎస్ ప్రతులను కాల్చి తమ నిరసన వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డి మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఉద్యోగులు యూపీఎస్ అని రాసిన ప్రతులను కాల్చి, ప్రభుత్వ చర్యను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు.యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట జడ్పీహెచ్‌ఎస్‌లో యూపీఎస్ ప్రతులను దహనం చేసినట్లు టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాణాల భాస్కర్‌రెడ్డి తెలిపారు.

రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ

లింగంపేట, జనవరి 28: మండలంలోని ఆయా క్లస్టర్లలోని రైతు వేదికల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి అనిల్‌కుమార్ మంగళవారం తెలిపారు. రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయం పొందడానికి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. మండలంలోని మోతె, లింగంపేట, పర్మళ్ల, పోల్కంపేట, ముంబాజీపేట క్లస్టర్లలో ఏఈవోలు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రైతులు దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకుఖాతా జిరాక్స్ కాపీలను జత చేయాలన్నారు.

మహిళా, శిశు సంరక్షణపై అవగాహన

నాగిరెడ్డిపేట, జనవరి 28: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా, శిశు సంరక్షణపై జిల్లా మహిళా సాధికారిక కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సృజన్‌కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం మహిళలు, శిశు సంరక్షణపై చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. బేటి బచావో..బేటీ పడావో పథకం ప్రారంభించి 10 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వండివార్చిన ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో భోజనాన్ని వండుతున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 28: పాఠాలు చెప్పడంలోనే కాదు.. అవసరం వస్తే విద్యార్థుల కోసం వంట చేయడానికి కూడా తాము సిద్ధమే అని ఆ ఉపాధ్యాయులు నిరూపించారు. వంట ఏజెన్సీ నిర్వాహకులు సమ్మె కారణంగా మంగళవారం రాకపోవడంతో, విద్యార్థుల భోజనానికి ఇబ్బంది కాకుండా పాఠశాల హెచ్‌ఎం మాణిక్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనాన్ని తయారుచేసి యథావిధిగా విద్యార్థులకు వడ్డించారు. భోజనం తయారు చేసిన పీడీ లాల్‌సింగ్,ఉపాధ్యాయులు యాదయ్య,మధుసూదన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డిని తోటిఉపాధ్యాయులు అభినందించారు.

పోచారం ప్రాజెక్టు నీటి విడుదల

నాగిరెడ్డిపేట, జనవరి28: మండలంలోని పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువకు రెండో విడుత నీటి విడుదలను మంగళవారం ప్రారంభించినట్లు నీటి పారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మొదటి విడుత ఈనెల 18న పూర్తి కావడంతో..కాలువ ద్వారా నీటి విడుదల నిలిపివేశామని, తిరిగి మంగళవారం నుంచి రెండో విడుత నీటి విడుదల చేపట్టామన్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 1.3 టీఎంసీలు (ప్రధాన కాలువ గేట్ల వద్ద 17 అడుగుల నీరు) నిల్వ ఉన్నదన్నారు. 15 రోజుల పాటు పంటల సాగుకు నీటి విడుదల కొనసాగుతుందన్నారు.

'ఉపాధి'లో ప్రజోపయోగ పనులు చేపడుతున్నాం

నాగిరెడ్డిపేట, జనవరి 28: ఉపాధి హామీ పథకంలో ప్రజోపయోగకర పనులు చేపడుతున్నామని డీఆర్డీవో సురేందర్ అన్నారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథక ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఈయేడు 37 లక్షల99వేల903 పని దినాలు కల్పించామని, 551 కుటుంబాలు వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్నాయన్నారు. గతంలో పూడితతీత పనులు అధికంగా ఉండగా వాటితో ప్రయోజనాలు తక్కువగా ఉండడతో.. ఈయేడు ఫార్మేషన్ రోడ్డు, ఫాంపాండ్ వంటి ప్రజలకు ఉపయోగకరమైన పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి రత్నం, ఏపీవో సాయిలు, ఎస్ఆర్పీ తిరుపతి,గ్రామాల కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా శక్తి కార్యక్రమం విజయవంతం చేయాలి

నాగిరెడ్డిపేట, జనవరి 28: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపడుతున్న మహిళా శక్తి పథకాన్ని విజయవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ అన్నారు. నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో మంగళవారం నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట మండలాలకు చెందిన ఐకేపీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించి ఆర్థికంగా చేయూతనిచ్చి ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలను వారితో ఏర్పాటు చేయించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం రవీందర్‌రావు, సుధాకర్, ఎల్లారెడ్డి ఏపీఎం ప్రసన్నరాణి పాల్గొన్నారు.